ప్రారంభ లాభాలు ఆవిరి

ముంబై, సెప్టెంబర్ 5: స్టాక్ మార్కెట్ల ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు నష్టపోవడం, గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో చివర్లో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు.

1:1 బోనస్ షేర్లకు సై

ఆమోదించిన రిలయన్స్ బోర్డు • ఏడేండ్ల తర్వాత ఇప్పుడే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: వాటాదారులకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వినాయక చవితి పండుగ కానుకను అందించింది. 1:1 బోనస్ షేర్ల జారీకి ఆ సంస్థ బోర్డు గురువారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో రిలయన్స్ పేర్కొన్నది. ప్రస్తుతం షేర్‌హోల్డర్ల వద్ద ఉన్న రూ.10 విలువైన ప్రతీ ఫుల్ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్‌కు సమాన విలువలో మరో ఫుల్లీ పెయిడ్-అప్ ఈక్విటీ షేర్‌ను ఉచితంగా ఇచ్చేందుకు తమ కంపెనీ బోర్డు సిఫార్సు చేసినట్టు బిలియనీర్ ముకేశ్ అంబానీ నేతృత్వంలోని ఆర్ఐఎల్ ప్రకటించింది. ప్రస్తుతం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ విలువ రూ.2,987.15 వద్ద ముగిసింది. బుధవారం ముగింపుతో పోల్చితే 1.41 శాతం దిగజారింది.



ఏడేండ్ల తర్వాత..

రిలయన్స్ ఇన్వెస్టర్లకు ఇలా 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు దక్కడం గడిచిన ఏడేండ్లలో ఇదే తొలిసారి. ఇంతకుముందు 2017 సెప్టెంబర్‌లో ఇలాగే 1:1 బోనస్ షేర్లను కంపెనీ ఇష్యూ చేసింది. నాడు కంపెనీ షేర్ ధర దాదాపు రూ.700లుగా ఉన్నది. అంతకు ముందు 2009-10లో వాటాదారులకు 1:1 బోనస్ షేర్లు దక్కాయి. అయితే తొలి బోనస్ 1980-81లో జారీ అయ్యింది. 3:5 నిష్పత్తిలో ఇచ్చారు. ఆ తర్వాత 1983-84లో 6:10తో ప్రకటించారు. 1:1 నిష్పత్తిలో మాత్రం తొలిసారి 1997-98లో జారీ చేశారు. మొత్తంగా రిలయన్స్ ఐపీవో దగ్గర్నుంచి ఇన్వెస్టర్లకు ఇది 6వ బోనస్. ప్రస్తుతం దేశీయ అతిపెద్ద కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఉన్న విషయం తెలిసిందే. నిజానికి ఇటీవల నిర్వహించిన కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలోనే ఈ 1:1 బోనస్ షేర్ల జారీ ప్రకటన అధికారికంగా వెలువడింది. అయితే తాజాగా జరిగిన బోర్డు సమావేశంలో దానికి ఆమోద ముద్ర పడింది. కాగా, ఈ బోనస్ షేర్ల జారీ కోసం రికార్డు తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఇదిలావుంటే కంపెనీ ఆథరైజ్డ్ షేర్ క్యాపిటల్‌ను రూ.15,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్లకు పెంచుకోవడానికి కూడా కంపెనీ బోర్డు ఈ సందర్భంగా అనుమతిచ్చింది. దీంతో షేర్ హోల్డర్ల అనుమతిని సంస్థ కోరుతున్నది.

జియో వార్షికోత్సవ ఆఫర్లు

దేశీయ టెలికం రంగ దిగ్గజం రిలయన్స్ జియో.. 8వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం తమ కస్టమర్లకు పలు రిచార్జ్ ప్లాన్లపై ఆఫర్లను ప్రకటించింది. జియో.కామ్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం ఈ నెల 5 నుంచి 10వ తేదీ మధ్య ఎవరైతే 3 నెలల ప్లాన్లు, ఏడాది ప్లాన్‌ను రిచార్జ్ చేసుకుంటారో వారికి రూ.700 విలువైన 3 ప్రయోజనాలను అందిస్తున్నట్టు తెలిపింది. వీటిలో 10 ఓటీటీలు, రూ.175 విలువైన 28 రోజుల వ్యాలిడిటీ గల 10జీబీ డాటా ప్యాక్, ఉచిత జొమాటో 3 నెలల గోల్డ్ మెంబర్‌షిప్ ఉన్నాయి. కాగా, రూ.899, రూ.999లతో ఉన్న త్రైమాసిక ప్లాన్లు.. రూ.3,599తో ఉన్న వార్షిక ప్లాన్లకే ఈ ప్రయోజనాలు వర్తిస్తాయి. త్రైమాసిక ప్లాన్లలో కస్టమర్లకు రోజూ 2జీబీ డాటా ఉంటుంది. ఇక రూ.899 ప్లాన్ గడువు 90 రోజులైతే.. రూ.999 ప్లాన్ కాలవ్యవధి 98 రోజులు. అలాగే రూ.3,599 ప్లాన్ గడువు 365 రోజులు. రోజూ 2.5జీబీ డాటాను వాడుకోవచ్చు. 2016 సెప్టెంబర్‌లో ఉచిత వాయిస్ కాల్స్, చౌక ధరలకే ఇంటర్నెట్ సేవలతో భారతీయ టెలికం రంగంలోకి జియో సంచలనాత్మక ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. 2జీ, 3జీలను పక్కనబెట్టి 4జీతో పరిచయమైంది. ఈ క్రమంలోనే కేవలం 170 రోజుల్లోనే 10 కోట్ల కస్టమర్ల మార్కును జియో తాకింది. అంతేగాక జియోఫోన్ (ఇంటిలిజెంట్ స్మార్ట్‌ఫోన్), జియోభారత్ (అల్ట్రా-అఫర్డబుల్ 4జీ ఫోన్), జియో ఫైబర్, ఎయిర్‌ఫైబర్ (ఫిక్స్‌డ్ వైర్‌లెస్ బ్రాడ్‌బాండ్ ఆఫర్), పూర్తిస్థాయిలో 5జీ సర్వీసులనూ అందుబాటులోకి తెచ్చింది. ఇటీవలి వార్షిక వాటాదారుల సమావేశంలో జియో యూజర్ల కోసం 100జీబీదాకా ఉచిత క్లౌడ్ స్టోరేజీని కూడా ముకేశ్ అంబానీ ప్రకటించిన సంగతి విదితమే. ఏఐ సాంకేతికతతో వివిధ ఫీచర్లను కస్టమర్లకు అందిస్తున్నట్టూ పేర్కొన్నారు.

బుచ్ రాజీనామా చేయాలి

సెబీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల నిరసనలు

ముంబై, సెప్టెంబర్ 5: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉద్యోగులు నిరసనల బాట పట్టారు. అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్న సెబీ చీఫ్ మాధబీ పురి బుచ్ రాజీనామాను కోరుతూ ఇక్కడి బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోగల హెడ్ ఆఫీస్ ఎదుట పెద్ద ఎత్తున మౌన ప్రదర్శన ఇచ్చారు. బుచ్‌తో పాటు ఈ వ్యవహారంలో ఉన్న ఇతర అధికారుల కార్యాలయాల ముందూ నిరసనల్ని వ్యక్తం చేశారు. ఇందులో 200 మందికిపైగా పాల్గొన్నట్టు అంచనా. వీరిలో ఎవరూ మీడియా ముందు మాట్లాడలేదు. కానీ బుధవారం సెబీ విడుదల చేసి పత్రికా ప్రకటనను ఉపసంహరించుకోవాలని, సెబీ చీఫ్ రాజీనామా చేయాలని నినదించారు. సుమారు గంటన్నరపాటు ఈ నిరసనలు కొనసాగాయి. నిజానికి గతంలోనూ ఇదే తరహాలో సెబీ ప్రధాన కేంద్రం వద్ద ఆందోళనలు జరిగాయి. అయితే వాటికి, ఉద్యోగులకు ఎలాంటి సంబంధం లేదని అక్కడి ఉన్నతాధికారులు కొట్టిపారేశారు. ఆ నేపథ్యంలో తాజా ఉద్యోగుల నిరసన మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. అదానీ గ్రూప్ వ్యవహారంలో బుచ్ పాత్ర కూడా ఉందని, విదేశాల్లోని కొన్ని సంస్థల్లో ఆమెకు, ఆమె భర్తకు వాటాలున్నాయని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ బయటపెట్టింది. అప్పట్నుంచి బుచ్ వార్తల్లో నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే ఆగస్టు 6న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు సెబీలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, ఉన్నతాధికారుల తీరు అస్సలు బాగాలేదంటూ దాదాపు 500 మంది ఉద్యోగులు లేఖ రాశారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో సెబీ ఓ పత్రికా ప్రకటనను విడుదల చేస్తూ అంతా ఉట్టిదే నంటూ కొట్టిపారేసింది. ఇది ఉద్యోగులకు మరింత ఆగ్రహాన్ని తెచ్చిపెట్టింది.

సహారా రూ.1,000 కోట్లు కట్టాలి

సహారా గ్రూప్.. ఓ ప్రత్యేక ఎస్క్రో ఖాతాలో 15 రోజుల్లోగా రూ.1,000 కోట్లను డిపాజిట్ చేయాలని సుప్రీం కోర్టు గురువారం ఆదేశించింది. అలాగే రూ.10,000 కోట్ల డిపాజిట్ కోసం ముంబైలోని వార్సోవా వద్దనున్న భూమి అభివృద్ధికి జాయింట్ వెంచర్ ఏర్పాటుకు అనుమతించింది.

ఈవీల సంస్థలకు రాయితీలు అవసరం లేదు

కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: విద్యుత్‌తో నడిచే వాహన తయారీ సంస్థలకు రాయితీలు ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టంచేశారు. ప్రస్తుతం కొనుగోలుదారులు సొంతంగా ఈవీలు లేదా సీఎన్‌జీ వాహనాలను ఎంచుకునే స్థాయికి చేరుకున్నారని బీఎన్ఈఎఫ్ సమ్మిట్‌లో చెప్పారు. ప్రారంభంలో ఈవీల తయారీదారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా రాయితీలు ప్రకటించినట్లు, ఆ తర్వాతి క్రమంలో వీటికి డిమాండ్ ఊపందుకున్నదని, దీంతో ఉత్పత్తిపై పెట్టే ఖర్చులు తగ్గుముఖం పట్టడంతో సంస్థలకు ఇచ్చే రాయితీలు అనవసరమని మంత్రి వ్యాఖ్యానించారు. పెట్రోల్, డీజిల్ వాహనాల కంటే ఎలక్ట్రిక్ వాహనాలపై విధిస్తున్న జీఎస్టీ తక్కువ స్థాయిలో ఉన్నదన్నారు. హైబ్రిడ్స్ వాహనాలతోపాటు పెట్రోల్, డీజిల్ వాహనాలపై 28 శాతం జీఎస్టీని వసూలు చేస్తుండగా, అదే ఎలక్ట్రిక్ వాహనాలపై 5 శాతం విధిస్తున్నారు.

మెర్సిడెజ్ బెంజ్..మరో ఎలక్ట్రిక్ మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. మేబ్యాచ్ ఈక్యూస్ 680 ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.2.25 కోట్లుగా నిర్ణయించింది. ఈ ధరలు ముంబై షోరూంనకు సంబంధించినవి. 107.8 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్‌తో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 611 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 4.4 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 210 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం అరగంటలోనే 80 శాతం వరకు చార్జింగ్ కానున్నది.

ఫార్మా విలేజీల్లేవ్.. క్లస్టర్లే!

1,000-2,000 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రభుత్వ యోచన

భూములు ఇచ్చేందుకు స్థానికులు ససేమిరా..

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీ స్థానంలోనే ఫార్మా క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. సుమారు 1,000 నుంచి 2,000 ఎకరాల స్థలంలో ఈ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేయోచనలో సర్కార్ ఉన్నది. ఇందుకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. సుమారు రూ. లక్ష కోట్ల పెట్టుబడితో 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బయోఏషియా-2024 సదస్సు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. ముందుగా వికారాబాద్, మెదక్, నల్గొండలలో ఈ విలేజ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు, ఒక్కో విలేజ్‌ను వెయ్యి నుంచి రెండు వేల ఎకరాల్లో ఉంటుందని ఆయన తెలిపారు. అయితే ఈ మూడు జిల్లాల్లో ఒకేచోట 1000ఎకరాల భూమి అందుబాటులో లేదని కలెక్టర్లు తేల్చిచెప్పడంతో రాష్ట్ర సర్కార్ దీనిపై పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. కానీ ఎలాగైన వికారాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ పద్ధతిలోనైనా ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. అయితే, అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లడం ఆలస్యం కావడం, భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేదిలేదని స్థానికులు తేల్చిచెప్పడంతోపాటు వారిని చుట్టుముట్టి ఆందోళన నిర్వహించారు. అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఫార్మాసిటీ కోసం గతంలో వచ్చిన దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండటంతో ఆయా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అవసరమైతే 2,000 ఎకరాల వరకైనా ఫార్మా క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలనుకుంటున్నారు. అయితే, గతంలో ప్రతిపాదిత ఫార్మాసిటీలో అన్ని రకాల ఔషధ పరిశ్రమల ఏర్పాటునకు వెసులుబాటు కల్పించాలని నిర్ణయించగా, తాజాగా ప్రతిపాదిత ఫార్మా క్లస్టర్‌లో కాలుష్యం కలిగించే బల్క్‌డ్రగ్ పరిశ్రమలను మినహాయించాలని నిర్ణయించారు. ఫార్మారంగంలో తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా హైదరాబాద్‌కు ఉన్న ప్రత్యేకతను సుస్థిరం చేసే విధంగా గత బీఆర్ఎస్ సర్కారు రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో సుమారు 14,029ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటునకు ప్రతిపాదించినది తెలిసిందే. మొదటి దశలో 8,900ఎకరాల్లో ఔషధ పరిశ్రమల ఏర్పాటునకు అవసరమైన ప్రణాళికలను కూడా గత ప్రభుత్వం సిద్ధం చేసింది. ఫార్మాసిటీలో సుమారు రూ. 64,000 కోట్ల పెట్టుబడులు, తద్వారా 4.20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనావేసింది.

మలబార్ గోల్డ్ 20 షోరూంలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్.. భారత్‌లో వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. వచ్చే నెలలో దేశవ్యాప్తంగా 20 షోరూంలను ప్రారంభించబోతున్నది. వీటిలో ఉత్తరప్రదేశ్‌లో మూడు, ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్‌లలో రెండేసి చొప్పున..ఒడిశా, తెలంగాణ, బెంగాల్, పంజాబ్‌లలో ఒక్క షోరూంను ప్రారంభించాలనుకుంటున్నట్లు మలబార్ గ్రూపు చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. దీంతోపాటు షార్జా, ఖతార్, సౌదీ అరేబియా, ఉత్తర అమెరికాల్లో నూతన షోరూంలు అందుబాటులోకి తీసుకురానున్నది.

మీషోలో 8.5 లక్షల ఉద్యోగాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5: ప్రస్తుత పండుగ సీజన్‌లో మరో ఈ-కామర్స్ సంస్థ మీషో భారీ స్థాయిలో ఉద్యోగులను నియమించుకోవడానికి సిద్ధమైంది. విక్రయదారులు, లాజిస్టిక్ సేవల పరిధిలో 8.5 లక్షల మంది సీజనల్ సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వీరిలో అత్యధిక మంది తృతీయ శ్రేణి పట్టణాల్లో ఈ నియామకాలు ఉంటాయని పేర్కొంది.

జగన్‌కు ప్రాణహాని నిజమే

అందుకే ఆయనకు జెడ్ ప్లస్ భద్రత

హైకోర్టుకు సెక్యూరిటీ రివ్యూ కమిటీ నివేదిక

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): మాజీ సీఎం, ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రాణహాని ఉందని స్టేట్ సెక్యూరిటీ రివ్యూ కమిటీ అంగీకరించింది. అందుకే జెడ్ ప్లస్ భద్రతను కొనసాగించాలని సిఫారసు చేసినట్టు తెలిపింది. 2014 లో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎం పదవి నుంచి తప్పుకున్నాక ఆయనకు వై క్యాటగిరీ భద్రత ఉన్నదని హైకోర్టుకు వివరించింది. ఎమ్మెల్యేగా జగన్ 1+1 భద్రతకే అర్హులని ఎస్ఆర్వీ తేల్చింది. తన భద్రతను తగ్గించేశారని, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ముందున్న తన భద్రతను కొనసాగించేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరుతూ వైఎస్ జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనికి కౌంటర్ హైకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు రాష్ట్రస్థాయి సెక్యూరిటీ రివ్యూ కమిటీని గతంలో ఆదేశించింది. ఈ మేరకు ఎస్ఆర్వీ తరపున ఐఎస్‌డబ్ల్యూ డీఐజీ, ఎస్పీ ఎస్ నచికేత్ విశ్వనాథ్ కౌంటర్ దాఖలు చేశారు. ఈ కేసులో తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 13కు వాయిదా వేసింది.

ఆర్టీసీలో విభజించు.. పాలించు!

- నాడు డ్రైవర్లు.. నేడు కండక్టర్లకు వేతన బకాయిలు
- 2013 బాండ్ల బకాయిలు విడుదలలో ఆర్టీసీ వింత వైఖరి
- యాజమాన్యం తీరుపై కార్మికుల విస్మయం
- కార్మికులను విభజించి పాలిస్తుందని ఆగ్రహం
- అందరి సమస్యలు పరిష్కరించాల్సిందే : ఆర్టీసీ జేఏసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగులపై యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిపై ఆర్టీసీ జేఏసీ మండిపడుతున్నది. ఆర్‌పీఎస్ -2013 బాండ్ల బకాయిల చెల్లింపులో ఆర్టీసీ యాజమాన్యం అనుసరిస్తున్న పద్ధతిపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ కార్మికులకు యాజమాన్యం ఆర్‌పీఎస్ 2013 బాండ్లకు సంబంధించి రూ.280 కోట్ల బకాయి పడింది. వీటిలో రూ.80 కోట్లను కేవలం డ్రైవర్లకు మాత్రమే చెల్లించింది. మిగితా రూ.200 కోట్ల బాండ్ల బకాయిలను చెల్లించాలని ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు సిద్ధమయ్యారు. ఆగస్టు 27న రాష్ట్రవ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసనలు చేపట్టారు. ఈ నెల 10న డిమాండ్స్ డేకి పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికులను శాంతింపచేసేందుకు గురువారం సుమారు 12వేల నుంచి 15 వేల మంది కండక్టర్లకు సుమారు రూ. 50కోట్ల నుంచి రూ. 80 కోట్ల బాండ్ల బకాయిలను యాజమాన్యం విడుదల చేసింది. దీనిపై ఆర్టీసీ జేఏసీ హర్షం వ్యక్తం చేస్తూనే..మిగితా కేటగిరి వాళ్లకు ఎప్పుడు చెల్లిస్తారని డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్స్ పూర్తిగా పరిష్కరించే వరకు ఉద్యమ కార్యాచరణను కొనసాగిస్తామని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఇదురు వెంకన్న స్పష్టం చేశారు. ఆర్టీసీ యాజమాన్య వైఖరి వలన బాండ్ డబ్బులు రాని వారిలో ప్రభుత్వంపైన వ్యతిరేకత పెరుగుతుందని చెప్పారు. వినాయక చవితి పండుగలోపు 2013 వేతన సవరణ బాండ్స్ బకాయి డబ్బులు చెల్లించాలని టీజీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కొమిరెడ్డి రాజిరెడ్డి ఆర్టీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.



వంద సమస్యల్లో ఒక్కటి పరిష్కారమా?

కార్మికుల సమస్యలు వంద ఉంటే ఒకటీ అర పరిష్కారమైతే ఎలా? ఆర్టీసీ యాజమాన్యం విభజించి పాలిస్తున్నది. ఈ విషయాన్ని కార్మికులు గుర్తించాలి. ట్రేడ్ యూనియన్లు లేకుండా చేసి కార్మికులను హింసిస్తున్నారు. ఆర్టీసీ ఎండీ ట్రేడ్ యూనియన్లను గుర్తించడం లేదు.

- యాదయ్య ఎస్‌డబ్ల్యూఎఫ్ ఐఎన్‌టీయూసీ ప్రతినిధి

కార్మికుల మధ్య విభేదాలు సృష్టించొద్దు : టీఎంయూ

అప్పుడు డ్రైవర్లు.. ఇప్పుడు కండక్టర్లకు బకాయిలు చెల్లించి కార్మికుల మధ్య విభేదాలు సృష్టించడం సరికాదని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు పీ కమాలాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం థామస్‌రెడ్డి, కార్యనిర్వహణ అధ్యక్షుడు మర్రి నరేందర్ అన్నారు. సంస్థలో కేటగిరీల వారిగా చెల్లింపులు చేయడం వలన కార్మికులలో వేర్పాటువాదానికి దారితీస్తుందని హెచ్చరించారు. శ్రామిక శక్తి నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఎండీ ఇష్టారీతిగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని కార్మికులను ఆందోళనలో పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం, ప్రభుత్వ అధినేతలు ఆర్టీసీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని టీఎంయూ ప్రతినిధులు కోరుతున్నారు.

ఎస్‌సీఆర్ ఏజీఎంగా బాధ్యతలు స్వీకరించిన నీరజ్ అగర్వాల్

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ అడిషనల్ జీఎంగా నీరజ్ అగర్వాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇండియన్ రైల్వేస్ సర్వీసెస్ ఇంజినీర్స్ 1987 బ్యాచ్‌కు చెందినవారు.

16 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): దసరా, దీపావళి తదితర పండుగల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో మాల్దా నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య 16 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు గురువారం రైల్వే అధికారులు తెలిపారు. అక్టోబర్ 8 నుంచి నవంబర్ 28 వరకు ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయని వెల్లడించారు. విశాఖపట్నం-షిర్డీ, షాలీమార్-హైదరాబాద్, సికింద్రాబాద్, బెంగళూరు-దానాపూర్ రైల్వే స్టేషన్ల మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లను ఈ నెల 4, 5 తేదీల్లో పునరుద్ధరించినట్టు తెలిపారు. న్యూఢిల్లీ-చెన్నై, గూడూరు-సికింద్రాబాద్, మణుగూరు-సికింద్రాబాద్ స్టేషన్ల మధ్య ఈనెల 5న పలు రైళ్లను రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు.

'కొలనుపాక'లో జైన తోరణం

హైదరాబాద్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో అరుదైన జైన తోరణం వెలుగుచూసింది. ఇటీవల 36 మందితో కూడిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఆధ్వర్యంలో అక్కడ పర్యటించి, సోమేశ్వరాలయ ఆవరణలోని మ్యూజియంలో జైన తోరణాన్ని గుర్తించింది. 8, 9వ శతాబ్దాల్లో పాలించిన రాష్ట్రకూటులు దీనిని చెక్కించారని హరగోపాల్ పేర్కొన్నారు. తోరణం పైభాగంలో ధ్యానముద్రలో ముగ్గురు తీర్థంకరులు, యక్ష, యక్షిణులు, ఇరువైపులా తీగెలు, పూలు చెక్కి ఉన్నాయని తెలిపారు. ఇలాంటి తోరణమే రాజుగారి దర్వాజ (గేట్ వే ఆఫ్ కొలనుపాక) జైన దేవాలయం వెనుకవైపు ఉన్నదని పేర్కొన్నారు. వీటిని భద్రపరచాలని పురావస్తు అధికారులను కోరారు.

విజయవంతంగా అమలవుతున్న సఖి కేంద్రాలు

- మహిళలకు కౌన్సెలింగ్, అత్యవసర వసతి
- కేసీఆర్ హయాంలో ఏర్పాటు
- ఏడేండ్లలోనే 65,460 కేసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మహిళలు, చిన్నారుల రక్షణ కోసం కేసీఆర్ హయాంలో ఏర్పాటైన సఖి కేంద్రాలు రాష్ట్రంలో మహిళలకు వరంగా మారాయి. పోలీసు శాఖతో కలిసి సఖి కేంద్రాలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ఇందులో బాధితులకు ఉచిత కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు వారంలో ఐదు రోజులపాటు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. 2017లో మహిళల రక్షణ కోసం 33 కొత్త జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన వీటిలో ఇప్పటివరకు 65,460 కేసులు నమోదయ్యాయి. మహిళల విషయంలో కేసీఆర్ ముందు స్తు ఆలోచన చేయడం వల్లే రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకొకటి చొప్పున సఖి కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. సఖి కేంద్రాల ఏర్పాటు ఘనత గత బీఆర్ఎస్ సర్కారుకే దక్కుతుందన్న అభిప్రాయాలు జోరుగా వినిపిస్తున్నాయి. సఖి కేంద్రాల్లో నమోదైన మొత్తం 65,460 కేసుల్లో గృహ హింస కింద 43,002 కేసులు, వరకట్నం వేధింపు కేసులు 3,049, పోక్సో కింద 2,278 ఇతర కేసులు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

టీడీపీ ఎమ్మెల్యే రాసలీలలు?

- సత్యవేడు ఎమ్మెల్యే అరాచకాలు
- పార్టీలో మహిళా కార్యకర్తకు ఆదిమూలం లైంగిక వేధింపులు
- అర్ధరాత్రి ఫోన్లు, మెసేజ్‌లతో బెదిరింపులు
- కుటుంబాన్ని చంపేస్తానని లైంగికదాడి
- పెన్ కెమెరాతో వీడియో విడుదల చేసిన బాధితురాలు
- హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో వివరాల వెల్లడి
- ఎమ్మెల్యేపై సస్పెన్షన్ విధిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రాసలీలలు వెలుగులోకి వచ్చాయి. పార్టీలో పని చేసే మహిళా కార్యకర్త ఫోన్ నంబర్ తీసుకుని అర్ధరాత్రి ఫోన్లు, మెసేజ్‌లతో బెదిరించినట్టు బాధితురాలు హైదరాబాద్‌లో గురువారం మీడియా సమావేశంలో వెల్లడించింది. తిరుపతిలో హోటల్‌కు తీసుకెళ్లి లైంగిక దాడి చేసినట్టు చెప్పింది. ఎవరికైనా చెబితే కుటుంబాన్ని చంపేస్తానని బెదిరించినట్టు ఆరోపించింది. మూడుసార్లు లైంగిక దాడి జరుపడంతో పెన్ కెమెరా వినియోగించి వీడియో విడుదల చేసినట్టు చెప్పింది. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక దాడి ఆరోపణలు రావడంతో టీడీపీ అధిష్ఠానం వెంటనే స్పందించింది. బాధితురాలు మీడియా సమావేశం పెట్టిన కొన్ని గంటల్లోనే ఎమ్మెల్యే ఆదిమూలంను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు నిర్ణయం తీసుకున్నారు. చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో 2014లో కోనేటి ఆదిమూలం వైసీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆదిమూలాన్ని 2024లో వైసీపీ అధిష్ఠానం తిరుపతి నుంచి పోటీ చేయాలని సూచించగా ఆయన అంగీకరించలేదు. దీంతో వైసీపీకి రాజీనామా చేసి సత్యవ